# నమస్తే తెలంగాణ

## జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, గురువారం 1 ఆగస్టు 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




పాల నురగలు కక్కుతూ శ్రీశైలం డ్యాం గేట్ల నుంచి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

## చివరిదశలో 'డబుల్' ఇండ్లు

- వనపర్తిలోనే అత్యధిక డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, జూలై 31 : పేదలకు బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేయించిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెబ్బేరు మండలంలోని పాతపల్లి, గుమ్మడం గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి గజ్వేల్ తరహాలో వనపర్తి నియోజకవర్గంలో అత్యధిక డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేయించానన్నారు. ఈ నేపథ్యంలోనే గుమ్మడం గ్రామానికి వంద ఇండ్లు మంజూరు కాగా వాటి పనులు చివరి దశ ఉన్నాయన్నారు. పాతపల్లికి యాభై ఇండ్లు మంజూరు కాగా, అవి స్లాబ్ వరకు వచ్చి నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించనందునా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని తాను మంగళవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించానని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పెబ్బేరులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు ఏర్పాటు చేసిన తులసీరాం ట్రేడర్స్ షాపును ఆయన ప్రారంభించారు. అలాగే చెలిమిల్లలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నాగశేషి అనే కార్యకర్తను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపిబాబు, ఎల్లారెడ్డి, నాయకులు మేకల ఎల్లయ్య, గోవిందునాయుడు, ఈశ్వర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



పాతపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న నిరంజన్‌రెడ్డి










## జన కళ

- శ్రీశైలం డ్యాంకు సందర్శకుల తాకిడి

శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు తెరవడంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో డ్యాం పరిసరాలకు చేరుకొని నీటి తుంపరలో తడుస్తూ.. సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల నుంచి పాల నురగను తలపించే ప్రవాహాన్ని తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. నీటి తుంపరలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఘాట్ రోడ్‌లో కిలోమీటర్లమేర ట్రాఫిక్ జాం అయ్యింది. మల్లికార్జున స్వామి, భ్రమరాంబదేవీని భక్తులు దర్శించుకున్నారు.

# జలవేణి

- శ్రీశైలం ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తివేత
- జూరాల 39 గేట్లు ఓపెన్
- ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్రకు ఇన్‌ఫ్లో
- నిండుకుండలా ప్రాజెక్టులు
- జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి

శ్రీశైలం, జూలై 31 : శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. బుధవారం డ్యాం ఎనిమిది గేట్లను తెరచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 2,58,285 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 19,272, సుంకేశుల నుంచి 16,256 క్యుసెక్కుల నీరు విడుదల కాగా, రిజర్వాయర్‌కు 3,62,411 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. 8గేట్ల ద్వారా 2,23,128 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 24,917, ఎడమగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న నాగార్జుసాగర్‌కు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, 884.50 అడుగులు, 215 టీఎంసీలకు ప్రస్తుతం 212.9198 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు.

### కృష్ణ, తుంగభద్ర పరవళ్లు

గద్వాల/అయిజ, జూలై 31 : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. బుధవారం జూరాలకు 3,10,000 ఇన్‌ఫ్లో రాగా 39గేట్లు ఎత్తి దిగువకు 2,83,080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా విద్యుదుత్పత్తికి 19,272 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్‌కు-2కు 750, జూరాల ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 652, కోయిల్‌సాగర్‌కు 630, సమాంతర కాల్వకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516మీటర్లు కాగా ప్రస్తుతం 317.820 మీటర్లుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 8.164 టీఎంసీలు ఉన్నది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 1,06,888 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,58,040క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 97.945 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. 1,633 అడుగుల నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1,631.02అడుగులు ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 48,370 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, 47,800క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 570 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా ప్రస్తుతం ఆనకట్టలో 11అడుగుల మేరకు నీటిమట్టం ఉన్నది. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 3,50,000 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్ ఫ్లో 3,50,000 నమోదైంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,35,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 3,33,740 క్యూసెక్కులు నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ఆర్డీఎస్ వద్ద వరద ఉధృతి



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు గేట్ల నుంచి పరవళ్లు తొక్కుతూ పారుతున్న వరద

## మందులు అందుబాటులో ఉంచాలి

- పశువైద్యశాల ఎదుట గొర్రెల కాపరుల ఆందోళన

దేవరకద్ర, జూలై 31 : పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉంచాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేశారు. బుధవారం దేవరకద్ర పశువైద్యశాల ఎదుట గొర్రెల కాపరులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలోని పశువైద్యశాలలో పశువులు, గొర్రెలకు మందులు లేకపోవడంతో మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులైనా స్పందించి పశువైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉంచాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



దేవరకద్ర పశువైద్యశాల ఎదుట నిరసన తెలుపుతున్న గొర్రెల కాపరులు

## గర్భస్త శిశువు మృతి ఘటనలో ముగ్గురు సస్పెన్షన్

పెబ్బేరు, జూలై 31 : పెబ్బేరు పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మంగళవారం గర్భస్త శిశువు మృతి చెందిన ఘటనకు సంబంధించి ముగ్గురిని అధికారులు సస్పెండ్ చేశారు. ఆ సమయంలో దవాఖాన ఇన్‌చార్జిగా ఉన్న వైద్యాధికారి సుధారాణి, స్టాఫ్ నర్సు బాలమణి కాంటింజెన్సీ వర్కర్ గౌరీని బాధ్యులుగా తేల్చినట్లు ప్రోగ్రాం అధికారి రామచందర్‌రావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముగ్గురిపై సస్పెన్షన్ విధించినట్లు చెప్పారు.

ఈ సృష్టిలో కల్తీ లేనిది ఏదైనా ఉందంటే అది అది తల్లిపాలే.. నవమాసాలు గర్భంలో ఉన్న బిడ్డతో ప్రేమ బంధాన్ని మరింత బలోపేతం చేసేది ఇవే.. తల్లి పాలే తొలి ఆహారం.. మహిళలు.. మాతృమూర్తిగా మారే సమయానికి పాలు ఉత్పత్తి కావడం సృష్టి ధర్మం.. ఆ ధర్మాన్ని నాటి నుంచి నేటి వరకు మనిషితోపాటు అన్ని క్షీరదాలు తమ బిడ్డలను పాలతోనే పెంచుతున్నాయి.. సమతుల్య ఆహారాన్ని.. రోగ నిరోధక శక్తిని, ఆరోగ్యాన్ని అందించేంది ఈ పాలే.. కానీ కొందరు తల్లులు కొన్ని అపోహలు.. ఉద్యోగ, ఆరోగ్య రీత్యా.. ఇతరత్రా కారణాలతో పోత పాలు పడుతున్నారు.. అందుకే తల్లి పాల విశిష్టతను, ప్రాముఖ్యతను తెలిపేందుకే తల్లిపాల వారోత్సవాలకు ఐసీడీఎస్, డీఎంహెచ్‌వో శాఖలు శ్రీకారం చుట్టాయి. ఇవి ఆగస్టు మొదటి వారంలో ప్రతి ఏడాది నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

– గద్వాల టౌన్, జూలై 31

# అమృతతుల్యం అమ్మపాలు

### ఆగస్టు మొదటి వారంలో..

ప్రతి ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారంపాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పుట్టిన గంటలోపే బిడ్డకు పాలిచ్చేలా తల్లికి సాయం చేయాలన్నదే వారోత్సవాల ఉద్దేశం. పుట్టిన బిడ్డకు ఏమీ తెలియకపోయినా ఒక విద్య మాత్రం తెలుసు.. అదే పాలు తాగడం.. బిడ్డ పాలు తాగగానే తల్లికి తేలిక కావడం ఇది.. ఒక మధురానుభూతికి లోనవడం సృష్టి ధర్మం. కానీ ఇప్పుడు దానికి విరుద్ధంగా జరుగుతుంది. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇస్తే హాని, దోషమని కొందరు భావిస్తుంటారు. అలాగే పసుపు రంగులో ఉండటం, చిక్కని పాలు తాగితే అరగవని అనుకోవడం, పాలు ఇస్తే అందం తరుగుతుందనే కొందరి మూర్ఖత్వంతో అమృతతుల్యమైన తల్లిపాలకు బిడ్డలను దూరం చేస్తున్నారు. నేటి తల్లులు తల్లిపాల సంస్కృతిని, సామాజిక బాధ్యతను విస్మరిస్తూ పసిబిడ్డల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. నేటి కంప్యూటర్ యుగంలో పుట్టిన బిడ్డలకు తల్లిపాలు పట్టడం గగనమైందని చెప్పొచ్చు. అందుకే ఎనిమిది రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్, డీఎంహెచ్‌వో శాఖల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను జరపనున్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముర్రుపాలతో కలిగే లాభాలను తల్లులకు వివరించనున్నారు. తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నారు.

### తల్లిపాలతో లాభాలు

తల్లిపాలు శిశువుకి అమృతం లాంటివి. పాలల్లో సంపూర్ణ పౌష్టికాహారం ఉంటుంది. తల్లికి, బిడ్డకు ఆరోగ్యవంతమైనవి. బిడ్డకు తల్లిపాలు కావాల్సిన ఉష్ణోగ్రతలో ఉన్నాయి. ఇవి వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తాయి. ముర్రుపాలలో శిశువుకు కావాల్సిన ఖనిజాలు, మాంసకృతులు, విటమిన్-ఏ సమృద్ధిగా ఉంటాయి. అలాగే పేగుల నుంచి విసర్జకాలను తొలగించడానికి, అలర్జీ రాకుండా నిరోధించడానికి ముర్రుపాలు తోడ్పడుతాయి. ఆరు నెలల దాకా తల్లిపాలు తాగడంతో జీవ సంబంధ వ్యాధులు ఉండవు. అంతేగాక జీర్ణకోశ నిరోధక శక్తి పెరిగి మలబద్ధక సమస్య ఉండదు. అస్తమా, చర్మవ్యాధి, లుకేమియా వంటి వ్యాధులు దరిచేరవు. పిల్లలు పెద్దయ్యాక అధిక రక్తపోటుగాని, మధుమేహ వ్యాధులు రాకుండా ముర్రు పాలు కాపాడుతాయని, అలాగే దృష్టిలోపం రాకుండా నివారిస్తాయి. అంతేగాక తల్లిపాలతో పోషకాహార లోపాలు, శిశు మరణాలు తగ్గే అవకాశం ఉన్నదని వైద్యులు చెబుతున్నారు.

- తల్లిపాలే శిశువుకు శ్రేష్ఠం, తొలి టీకా
- బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలి
- పోత పాలతో దీర్ఘకాల వ్యాధుల ప్రమాదం
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



### పాల డబ్బాలు ఎంత వరకు శ్రేయస్కరం

అంతరించిపోతున్న తల్లిపాల సంస్కృతితో పుట్టిన బిడ్డలు వివిధ లోపాలతో చనిపోతున్నారు. తల్లుల్లో వచ్చిన మార్పునకు మారిన పారిశ్రామీకరణనే అని చెప్పొచ్చు. ఇది ఆరంభమైన నాటి నుంచి మహిళకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువయ్యాయి. దీంతో చాలా వరకు ఉద్యోగాలలో చేరారు. విధులకు హాజరుకావాలన్నా హడావిడిలో బిడ్డలకుపాలు ఇవ్వడానికి వారికి సమయం సరిపోవడం లేదు. దీంతో డబ్బా పాలపై ఆధారపడాల్సి వస్తుంది. పట్టణాల నుంచి పల్లెల వరకు ఈ సంస్కృతి పాకింది. తల్లిపాల కంటే డబ్బా పాలే బిడ్డకు శ్రేయస్కరమన్న అపోహ తల్లుల్లో నాటుకుపోయింది. కానీ డబ్బా పాల నష్టాలు, కష్టాలను మాత్రం గమనించలేకపోతున్నారు. వారికి తోడు డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు కూడా పాలపొడుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారని అనొచ్చు. కానీ వీటితో భవిష్యత్‌లో పిల్లలకు వచ్చే వ్యాధులు, లోపాలను సూ చించలేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా తల్లులు, వైద్య విధానంలో కూడా మార్పు రావాలని ఆశిద్దాం.

### చెడుచూపుల్లో మార్పు రావాలి

గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగంగా తల్లి, బిడ్డకు పాలు పట్టడం సహజం. కానీ పట్టణాల్లోకి వచ్చే సరికి రైళ్లు, బస్సుల్లో, బహిరంగ ప్రదేశాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాలిచ్చే సమయంలో కొన్ని విషపు చూపుల మధ్య పసిబిడ్డ ఏడ్చిన వెంటనే పాలుపట్టే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి వారిలో మార్పు రావాలి. బిడ్డకు పాలు పట్టే సమయంలో తన తల్లిగానే ప్రతి ఒక్కరూ భావించే గుణం రావాలి. తల్లీబిడ్డకు బహిరంగ ప్రదేశాల్లో పాలుపట్టే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. ప్రత్యేకంగా పబ్లిక్ బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

### తల్లికి లాభమే..

పిల్లలకు పాలు పట్టడంతో తల్లులకు ఎంతో ప్రయోజనం చేకూ రుతుంది. ప్రసూతి సమయంలో బరువు తగ్గేందుకు దోహద పడతాయి. అలాగే మానసిక ఒత్తిడి, రక్తస్రావం తగ్గుతుంది. పిల్లలకు 6 నెలలపాటు పాలు పట్టడంతో తల్లులకు రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు రావని వైద్యులు వివరిస్తున్నారు. ఇప్పటికైనా నేటి తల్లులు పాశ్చాత్య ధోరణిని వదిలి పుట్టిన పిల్లలకు పాలు పట్టే సంస్కృతిని పాటించాలని కోరుకుందాం.

## కల్వకుర్తికి సీఎం రేవంత్ రిక్తహస్తం

- బీఆర్ఎస్ నేతలను తిట్టేందుకే కల్వకుర్తిలో సభ పెట్టినట్లు ఉంది
- ఈ ప్రాంత సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేకు అవగాహనే లేదు..?
- కేసీఆర్ హయాంలో జరిగిన పనులను మళ్లీ అడగడమేమిటీ?
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మీడియాకు కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన వందపడకల దవాఖాన ప్రొసీడింగ్ కాపీని చూపిస్తున్న జైపాల్ యాదవ్

కల్వకుర్తి, జూలై 31 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు' ఉన్నదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. కేవలం బీఆర్ఎస్ నాయకులను తిట్టడానికే కాంగ్రెస్ పెట్టుకున్న ఎన్నికల సభలా ఉన్నదని మండిపడ్డారు. బుధవారం కల్వకుర్తిలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి అంటే అందరికీ గౌరవం ఉన్నదని, పార్టీలకతీతంగా ఆయనకు ఎందరో అభిమానులు ఉన్నారన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని పార్టీలకతీతంగా అందరం స్వాగతిస్తున్నామన్నారు. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే.. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని, బహిరంగ సభను కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా మార్చారని ధ్వజమెత్తారు. ఈ ప్రాంతానికే కాకుండా, దేశానికి ఎనలేని సేవ చేసిన పెద్ద మనిషిని స్మరించుకునే కార్యక్రమాన్ని రాజకీయ కార్యక్రమం మార్చారని విమర్శించారు. అధికారిక కార్యక్రమైతే ప్రొటోకాల్‌కు విరుద్ధంగా పార్టీ కార్యక్రమంలా ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పీతోపాటు ఉన్నత స్థాయి అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సబబేనా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ ప్రాంత ప్రజలకు సేవలందించిన జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు ఎత్తిపోల పథకానికి పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే బడేబాయి పీఎం మోదీని ఒప్పించి ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి నీతినిజాయితీతో జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి మహేంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యేలు ఎడ్మ కిష్టారెడ్డి, ధ్యాప గోపాల్‌రెడ్డి పనిచేశారని చెప్పిన రేవంత్ తమను అవమాన పరిచాడని మండిపడ్డారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా తాను, మాజీ మంత్రిగా రాములు ఈ ప్రాంతానికి నీతినిజాయితీలో పనిచేయలేదా? అంటూ నిలదీశారు. దాదాపు రూ.5 వేల కోట్లతో కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టును దాదాపు రూ.35 వేల కోట్లు ఖర్చుపెట్టి 60 టీఎంసీలు నీరు నిల్వ ఉండేలా భారీ రిజర్వాయర్లను నిర్మించినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు కేవలం కాల్వల పనులు పూర్తి చేసి దాదాపు 12.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడి ఎమ్మెల్యేకు ఈ ప్రాంత సమస్యలు, అభివృద్ధిపై కనీస అవగాహన లేదనిపిస్తుందని దుయ్యబట్టారు. ఒకవేళ ఉంటే కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని మరిచి అవే పనులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌ను అడగటం చూస్తుంటే నవ్వు వస్తుందన్నారు. కల్వకుర్తిలో 50 పడకల దవాఖానను నాడు 100 పడకలుగా మారుస్తూ 2023 జూన్ 28న 366 జీవో ఇచ్చి మూడెకరాల స్థలం కేటాయించడంతోపాటు నిధులు మంజూరు చేయగా.. టెండర్ పూర్తయి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నాడని వివరించారు. ఇప్పుడేమో స్థానిక ఎమ్మెల్యే వంద పడకల దవాఖాన కావాలని అడగడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఏమైనా మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, పారిశ్రామిక కారిడార్, ఇతర అభివృద్ధి పనులను అడిగితే టీవీలు చూస్తున్న తామందరం సంతోషించామని, తీరా రేవంత్‌రెడ్డి ఇరవై, ముప్పై కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి పుట్టిన గడ్డకు శూన్య హస్తం చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం ఏమిటంటే కల్వకుర్తిలో సీఎంకు ఇల్లు కూడా ఉంది.. ఈ ప్రాంతంలోనే చిన్నతనంలో ఆయన చక్కర్లు కొట్టారు.. అయినా ఈ ప్రాంతంపై ఆయనకు ఏమాత్రం ప్రేమలేదనే అర్థమవుతుందన్నారు. పరిపాలన విషయానికొస్తే 'తుం మారో.. మై మారుంగా' అన్నట్లు ఉన్నదని ఎద్దేవా చేశారు. రుణమాఫీ కేవలం 23 శాతం రైతులకు మాత్రమే ఇస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని, రైతు భరోసాకు ఎగనామం పెట్టినట్టేనని, ఆరు గ్యారెంటీలకు ఇక మంగళమేనని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారని అన్నారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, బాలయ్య, చెన్నకేశవులు కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టంకరలో బైలెల్లిన బోనాలు

- పోచమ్మకు పూజలు చేసిన శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, జూలై 31 : మండలంలోని టంకరలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. నైవేద్యం సిద్ధం చేసి కొత్త కుండలలతో మహిళలు బైలెల్లారు. గ్రామంలోని పోచమ్మ ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కోళ్లు, మేకలతో మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు పండుగకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను సామాల సహదేవ్, సామాల వెంకటగిరి, శివకుమార్, జహంగీర్, ఆశన్న, శ్రీనివాస్‌తోపాటు గ్రామ ప్రముఖులు ఆహ్వానించగా.. పోచమ్మ తల్లికి, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యలతో వర్ధిల్లాలని, వేసిన పంటలు పుష్కలంగా పండాలని, అందుకు అమ్మవారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. తెలంగాణ ఏర్పడ్డాకే పండుగలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఆలయాన్ని నిర్మించి.. బస్టాండ్ నుంచి సీసీరోడ్డు వేయించినట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు రాజుయాదవ్, జంబులయ్య, శివకుమార్, ఆశన్న, వెంకటయ్య, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న టంకర గ్రామస్తులు